సాక్షి విశాఖపట్నం

గురువారం ౹ 6 ౹ మార్చి ౹ 2025





మగువా.. చూపు తెగువ

అలరించిన ఫ్లాష్ మాబ్



మహిళా దినోత్సవంలో భాగంగా ఆంధ్ర విశ్వ **విద్యాలయం** దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ **వుమెన్ స్టడీస్, ఏయూ యునైటెడ్** సంయుక్తంగా విద్యార్థుల **కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ**హిస్తున్నాయి. ఇందులో భాగంగా **ఏయూ బాస్కెట్** బాల్ మైదానంలో బుధవారం జరిగిన ఫ్లాష్ మాబ్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో వర్సిటీకి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని చాటి చెప్పే పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, సమాజంలో మహిళల పాత్రపై అవగాహన పెంచుతాయని వర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



న్యూస్‌రీల్

విశాఖ చేరుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి



గోపాలపట్నం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీ నుంచి బుధవారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆమెకు రాష్ట్ర మంత్రులు అనిత, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, బీజేపీ మహిళా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కి చేరుకున్నారు. గురువారం గీతంలో జరిగే పుస్తక ఆవిష్కరణలో పాల్గొంటారు. మధ్యాహ్నం బడ్జెట్ అంశంపై నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే సదస్సులో అధికారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులతో భేటీ అవుతారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడతారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.85 కోట్లు



హుండీ ఆదాయం లెక్కింపులో దేవస్థాన సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 28 రోజులకుగాను రూ.కోటి 85 లక్షల 22 వేల 270 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు తెలిపారు. సింహగిరిపై బుధవారం స్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 86.500 గ్రాముల బంగారం, 8.450 కిలోల వెండి లభించిందన్నారు. హుండీ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఓపెన్ ఇంటర్ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఓపెన్ ఇంటర్(సార్వత్రిక విద్య) పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీలకు ప్రత్యేకంగా ఓ సెంటర్ ఏర్పాటు చేశారు. బుధవారం తెలుగు పరీక్ష జరిగింది. 15 మంది ముద్దాయిలు ఓపెన్ ఇంటర్‌లో చేరినట్లు జైలు సూపరింటెండెంట్ ఎం. మహేష్‌బాబు తెలిపారు. ఇందులో నలుగురిని ఇటీవల రాజమండ్రి కేంద్ర కారాగారానికి బదిలీ చేయగా.. బుధవారం 11 మంది పరీక్ష రాసినట్లు వివరించారు.

800 గ్రాముల బంగారం చోరీ

కూర్మన్నపాలెం: తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్టీబీఎల్ సమీపంలో వసుంధరా గార్డెన్స్‌లో ఉప్పులూరి ఉమ తన పిల్లలతో నివసిస్తున్నారు. ఆమె భర్త అప్పలరాజు ఉద్యోగ రీత్యా ఖతర్‌లో ఉంటున్నారు. ఉమ అమ్మ రత్నం సమీపంలోని ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఈ నెల 3న ఉదయం ఇంటికి తాళం వేసి పిల్లలతో కలసి తన అమ్మ ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన ఉమ బెడ్‌రూమ్‌లో చూడగా.. బీరువా తలుపులు, లాకర్ విరగ్గొట్టి దుస్తులు చిందర వందరగా పడి ఉండటం గమనించింది. అందులోని సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

28న పెన్షన్ అదాలత్

ఎంవీపీకాలనీ : తపాలా ఉద్యోగుల పెన్షన్ సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28వ తేదీన ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయంలో పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ రీజనల్ కార్యాలయం సూపరింటెండెంట్ తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారి సమస్యలను ఈ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వారి ఫిర్యాదులను ఈ నెల 15లోపు సూపరింటెండెంట్ ఆర్ఎంఎస్–వి డివిజన్, విశాఖపట్నం కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు.

నేడు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలి రాక

మహారాణిపేట: ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి.. ఉదయం 7.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఏయూలోని వైవీఎస్ ఆడిటోరియంలో జరిగే మహిళా సదస్సు వర్క్‌షాపులో ఆమె పాల్గొంటారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల మెడపై కత్తి



- మళ్లీ తెరపైకి కార్మికుల తగ్గింపు ప్రక్రియ
- కాంట్రాక్టర్లకు సమాచారం
- ఆర్ఎల్‌సీకు ఫిర్యాదు

విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ **కార్మి కుల** తగ్గింపు ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చిం**ది. ఈ అంశం**పై కాంట్రాక్టర్లకు యాజమాన్యం స**మాచారం అం**దజేసింది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పున **రుద్ధరణ**, పొదుపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల**కు వీఆర్ఎస్**, ఇతర స్టీల్‌ప్లాంట్లకు డిప్యూటేషన్, **కాంట్రాక్ట్ కార్మి**కుల తగ్గింపు వంటి చర్యలకు సిఫార్సు చేశారు. ఈ చర్యల్లో భాగంగా గతంలో ఒకేసారి సుమారు 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల ఆన్‌లైన్ గేటు పాసులను నిలిపి వేశారు. ఈ వివాదం పెద్దది కావడంతో కొన్ని గేటు పాసులను పునరుద్ధరించారు. వివిధ కారణాల వల్ల సుమారు 600 మంది కాంట్రాక్ట్ కార్మికుల **పాసులు పునరుద్ధరించలేదు. దీంతోపాటు** ఎస్ఎంపీ, ఏఎస్ఎంపీ నిలిపివేత తదితర అంశాలపై ఈ నెల 7న సమ్మె చేస్తామని కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు యాజమాన్యానికి నోటీసు అందజేశాయి. ఈ అంశంపై ఈ నెల 11న సమావేశం ఏర్పాటు చేస్తామని రీజనల్ లేబర్ కమిషనర్ హామీ ఇవ్వడంతో సమ్మె వాయిదా వేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపుపై చర్చ

మంగళవారం కేంద్ర ఉక్కు కార్యదర్శి స్టీల్‌ప్లాంట్‌కు వచ్చారు. ఉన్నత యాజమాన్యంతో జరిపిన సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపుపై చర్చ జరిగినట్టు తెలుస్తుంది. దీంతో యాజమాన్యం సక్రమంగా విధులు నిర్వహించని, క్రమశిక్షణారాహిత్యం కలిగిన కార్మికుల వివరాలు ఇవ్వాలని కాంట్రాక్టర్లను ఆదేశించింది. దీంతో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు రీజనల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై యాజమాన్యంతో తేల్చుకోవడానికి కార్మిక సంఘాల నాయకులు సమాయత్తమవుతున్నారు.

సీఎం, కేంద్ర మంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లాలో గురువారం ముఖ్యమం**త్రి చంద్రబాబు, కేంద్ర** ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా **సీతారామన్ పర్యటనకు** పటిష్ట ఏర్పాట్లు చేయాలని **కలెక్టర్ ఎం.ఎన్.హరేం**దిర ప్రసాద్ అధికారులను **ఆదేశించారు. బుధవార**ం కలెక్టరేట్‌లో జరిగిన సమ**న్వయ కమిటీ సమావే**శంలో కలెక్టర్ పలు అంశా**లపై అధికారులకు దిశా**నిర్దేశం చేశారు. ముఖ్యమం**త్రి, కేంద్ర ఆర్థిక శాఖ** మంత్రి గురువారం గీతం **యూనివర్సిటీలో జరి**గే పుస్తక ఆవిష్కరణలో **పాల్గొంటారని.. శాంతి** భద్రతలు, సెక్యూరిటీ **పరమైన అంశాల్లో పో**లీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, వారు ప్రయాణించే మార్గంలోని రోడ్లపై బ్యానర్లు, విద్యుత్ తీగలు, పోస్టర్లు తొలగించాలని జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద స్వాగతం, వీడ్కోలుకు సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలని ఆర్డీవోకు సూచించారు. డీసీపీ అజిత, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు పాల్గొన్నారు. ముందుగా గీతంలో పర్యటన ఏర్పాట్లను ఎంపీ ఎం.శ్రీభరత్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ స్వయంగా పరిశీలించారు.

సీఎం పర్యటన ఇలా..: సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ భవన్ నుంచి గీతం వర్సిటీకి గురువారం ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు అక్కడ జరిగే పుస్తక ఆవిష్కరణలో భాగస్వామ్యమవుతారు. అనంతరం అక్కడ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకొని ఢిల్లీ బయలుదేరుతారు.

నేడు మద్యం దుకాణాల లాటరీ

- జిల్లాలో గీత కులాలకు 14 మద్యం దుకాణాల కేటాయింపు
- 121 మంది నుంచి 316 దరఖాస్తులు రాక

విశాఖ సిటీ: కల్లు గీత కులాల మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నారు. విశాఖ జిల్లాలో 14 మద్యం దుకాణాలను గీత కులాలకు కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో 11, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో మూడు దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. కల్లు గీత కులాలకు జనాభా దామాషా పద్ధతిలో రెండు నెలల క్రితం లాటరీ ప్రక్రియ ద్వారా 14 మద్యం దుకాణాలను కేటాయించారు. ఇందులో జీవీఎంసీ పరిధిలో గౌడ, యాత కులాలకు ఒక్కోటి, మిగిలిన తొమ్మిది దుకాణాలు శెట్టిబలిజ కులానికి దక్కాయి. అలాగే ఆనందపురంలో ఒకటి గౌడకు, భీమిలి, పద్మనాభం మండలాల్లో ఒక్కోటి శెట్టిబలిజకు లాటరీ ద్వారా అవకాశం లభించింది. వాస్తవానికి గత నెల 7వ తేదీన లాటరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ మహాకుంభమేళా, బసంత్ పంచమీ, రాధా సప్తమీ వంటి ఆధ్యాత్మిక యాత్రలు ఉండడంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించారు. తరువాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో లాటరీ ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా ఎన్నికల నియమావళి తొలగిపోవడంతో గురువారం లాటరీ నిర్వహించనున్నారు.

14 దుకాణాలకు 316 దరఖాస్తులు

గీత కార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణాలకు 316 దరఖాస్తులు వచ్చాయి. కొందరు రెండు, మూడు దరఖాస్తులు సమర్పించడంతో 121 మంది ఈ లాటరీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దరఖాస్తుదారులందరూ లాటరీ సమయానికి గంట ముందుగా మధ్యాహ్నం 2 గంటలకే వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాకు రావాల్సి ఉంటుంది. 3 గంటలకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ లాటరీ ప్రక్రియను ప్రారంభి షాపులు కేటాయించనున్నారు.

భారతీయ సంప్రదాయమే సైన్స్ భాండాగారం

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ అవినాష్ చందర్
- ఎన్ఎస్‌టీఎల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ అవినాష్, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం



నరవ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

గోపాలపట్నం: భారతీయ సంప్రదాయమే సైన్స్ భాండాగారమని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ అవినాష్ చందర్ అన్నారు. ఎన్ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో బుధవారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన అంబేడ్కర్ విగ్రహం వద్ద, వేదికపై సర్ సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినాష్ చందర్ మాట్లాడుతూ మన పూర్వీకుల్లో భాస్కరాచార్య, చరక, సుశ్రుత, వరాహమిహిర, ఆర్యభట్ట వంటి ఎందరో మహానుభావులు అనేక కొత్త విషయాలను ఆవిష్కరించారన్నారు. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉత్తమ ప్రతిభ చూపుతోందని, యువకులు నూతన ఆలోచనలతో ఆవిష్కరణలు చేస్తున్నారని పేర్కొన్నారు. శాస్త్రీయత శిక్షణ కలిగి ఉండేలా విద్యా విధానంలో మార్పు రావడం స్వాగతించదగినదన్నారు. పదేళ్ల కిందట 471 స్టార్టప్స్ ఉండగా.. నేడు 1.40 లక్షలకు అవి పెరగడంతో ఉద్యోగాలు కూడా పెరిగాయని చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సైన్స్ డే సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్‌లో చేపట్టిన కార్యక్రమాలను డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ వివరించారు. సైంటిస్ట్ డి.ఉదయానంద్‌కు సిలికాన్ మెడల్, సర్టిఫికెట్‌ను బహూకరించారు. పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. నరవ హైస్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి, ఎన్ఎస్‌టీఎల్ రామ్‌నాథ్ సెకండరీ స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సైంటిస్ట్ బోని రమేష్‌బాబు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

ముగ్గురు విద్యార్థినులపై చర్యలు



జగదాంబ: డీడీఆర్ నర్సింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేగింది. ఇందుకు కారణమైన విద్యార్థినులపై ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. వన్‌టౌన్ షాదీఖానా వెనుక ఈ కళాశాల ఉంది. ఈ కళాశాలలో మూడేళ్ల కోర్సుకు సంబంధించి 80 మంది విద్యార్థినులు నగరంతో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చి అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది చేరిన 18 మంది విద్యార్థినులను చివరి సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ర్యాగింగ్ చేశారు. దీంతో వారందరూ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా.. ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థినులను ప్రిన్సిపాల్ పిలిచి మందలించారు. 'మీరు హాస్టల్‌లో ఉండకూడదు. ఇంటి వద్ద నుంచే డేస్కాలర్‌గా కళాశాలకు రావాలి'అని చెప్పడంతో ఆ విద్యార్థినులు హాస్టల్ నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. 'విద్యార్థినులు ర్యాగింగ్ చేయడంతో మందలించి ఇంటికి పంపించిన మాట వాస్తవమే' అని అన్నారు. వారు స్థానికులు కావడంతో హాస్టల్‌లో ఉండకూడదని హెచ్చరించామని, దీనిపై వస్తున్న వదంతులు అవాస్తమని చెప్పారు. ఈ విషయం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తెలియజేసినట్లు వెల్లడించారు.

'లే అవుట్' నిబంధనలు సరళతరం

విశాఖ సిటీ: పురపాలక మంత్రిత్వ శాఖ జారీ చేసిన కొత్త జీవోల ప్రకారం భవన నిర్మాణాలు, లేఅవుట్ల అభివృద్ధి విషయంలో నిబంధనలు పాటించాలని డీటీసీపీవో పి.నాయుడు సూచించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలు 3, 4, 5, 20లపై ఎల్‌టీపీలు, ఇంజినీర్లు, ప్లానింగ్ సెక్రటరీలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జీవోల్లో కొన్ని వెసులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. లేఅవుట్లకు 21 రోజుల్లో అనుమతి ఇవ్వాలని నిర్దేశించినట్లు చెప్పారు. యుటిలిటీస్, ఎమినిటీస్ బ్లాక్‌లకు నిర్దిష్టమైన నిబంధనలు పెట్టారని వెల్లడించారు. ఐదు ఎకరాలలోపు లే అవుట్లలో 40 అడుగుల రహదారి ఒకటి, అంతకు మించిన లేఅవుట్లలో రెండు రహదారులు ఉండాలని వివరించారు. జాతీయ రహదారి, రాష్ట్ర హైవేలకు ఆనుకుని ఉన్న లేఅవుట్ల విషయంలో సంబంధిత అధికారుల నుంచి ఎన్‌వోసీ ఉండాలని స్పష్టం చేశారు. లే అవుట్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. నదులకు సమీపంలో అభివృద్ధి చేసే లేఅవుట్ల విషయంలో బఫర్ జోన్ 100 మీటర్ల నుంచి 50 మీటర్లకు తగ్గించారని తెలిపారు. వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, పీవో మౌనిక, డీటీసీపీ ఆర్డీ పి.నాయుడు, పీసీపీఐఆర్ పీవో చైతన్య పాల్గొన్నారు.

బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణకు చర్యలు

కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



బీచ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కొమ్మాది: బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ జరిగేలా రుషికొండ బీచ్‌లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. రుషికొండ బీచ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. సమష్టి కృషి చేసి బీచ్‌కు పూర్వ వైభవం తీసుకుని రావాలని, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా ప్రణాళికలతో పనులు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, కూర్చొని సేద తీరే ప్రాంతాలు, దుకాణ సముదాయాలు, పారిశుధ్య నిర్వహణ, గ్రీనరీ తదితర అంశాలను పరిశీలించిన ఆయన.. అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అలాగే పర్యాటకుల భద్రత ప్రమాణాలు పాటించాలని పోలీసు అధికారులకు సూచించారు. దుకాణ సముదాయాల నిర్వహణ, ఆహార పదార్థాల తయారీ, ధరల నియంత్రణ, తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. టూరిజం శాఖ ఇన్‌చార్జి ఆర్డీ జగదీశ్, టూరిజం అధికారి గరికిన దాసు, వీఎంఆర్‌డీఏ, టూరిజం, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ కోసం త్వరలో అఖిలపక్ష సమావేశం

విశాఖ లీగల్ : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ త్వరలో ఆరు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఇతర నాయకులతో కలిసి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఏడు జిల్లాల(శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ) న్యాయవాదులతో ఒక సదస్సును ఏర్పాటు చేసి.. మద్దతు కూడగట్టామని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్ష సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజా ప్రతినిధులు, ఇతర నేతల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఈ ఆరు జిల్లాల ప్రజాభీష్టాన్ని వివరించనున్నట్లు తెలిపారు. హైకోర్టు బెంచ్ కోసం తాము చేస్తున్న కార్యక్రమాలకు అన్ని వర్గాలు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సింహగిరి మాస్టర్‌ప్లాన్ సవరణకు పరిశీలన

సింహాచలం: సింహగిరి మాస్టర్‌ప్లాన్ మార్పులు–చేర్పులపై దేవదాయశాఖ టెక్నికల్ అడ్వైజర్ కొండలరావు బుధవారం పరిశీలన జరిపారు. 2000 నుంచి సింహగిరి దివ్యక్షేత్రం అభివృద్ధి పనులు ప్రారంభమవగా, ఆరేళ్ల క్రితం వరకు జరిగిన అభివృద్ధి పనులతో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆ తర్వాత సింహగిరిపై కొన్ని అభివృద్ధి పనుల్లో మార్పులు చేర్పులతోపాటు, ఏడాదిన్నర కిందట ప్రసాద్ పథకం పనులు ప్రారంభమయ్యాయి. దీంతో మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు అనివార్యమయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రసాద్ పథకం పనులతో పాటు ఇంకా దేవస్థానం తరఫున చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను చేర్చి మాస్టర్ ప్లాన్‌ని పక్కాగా తయారు చేయాలని దేవదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ టెక్నికల్ అడ్వైజర్ తన బృందంతో వచ్చి ప్రసాద్ పథకం పనులను పరిశీలించారు. అధికారులు, వైదికులతో చర్చించి పక్కాగా మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు నివేదికలను కమిషనర్‌కు పంపిస్తామన్నారు.



వెనక్కి వెళ్లిన సముద్రం

రుషికొండ బీచ్ వద్ద సముద్రం బుధవారం వెనక్కి వెళ్లింది. సాధారణంగా అలలతో నిండి ఉండే ఈ తీర ప్రాంతంలో దాదాపు 15 అడుగుల మేర సముద్రం వెనక్కి వెళ్లడంతో ఇసుక తిన్నెలు, రాళ్లు బయటపడ్డాయి. ఇది చూసిన స్థానికులు, పర్యాటకులు ఆశ్చర్యానికి గురయ్యారు. రాళ్లపై పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఇలాంటి మార్పులు సంభవించినప్పుడు పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఈత రాని వారు నీటిలోకి దిగవద్దని హెచ్చరించారు.

- కొమ్మాది

అర్ధరాత్రి ఘోరం..



చెట్టును బైక్‌తో ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

సీతమ్మధార: రైల్వే న్యూ కాలనీ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. కంచరపాలెం పరిధిలోని ధర్మానగర్, వాడపేటలో మంగళవారం స్థానిక అమ్మవారి పండగ జరిగింది. తిక్కవానిపాలేనికి చెందిన గోపి(20), అచ్చిరాజు(20) బైక్‌లో బయలుదేరి.. సాయంత్రం అక్కడ జరిగిన పరసలో పాల్గొన్నారు. అప్పటికే వారు మద్యం మత్తులో ఉన్నారు. తిరిగి అర్ధరాత్రి దాటాక రైల్వే న్యూ కాలనీ నుంచి కంచరపాలెం వైపు వెళుతున్నారు. అతివేగంతో వెళ్తూ రైల్వే న్యూ కాలనీ సాయిబాబా గుడి ఎదురుగా చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. పండగలో సరదాగా గడిపిన యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల కన్నీటిపర్యంతమయ్యారు. యువకుల మృతితో తిక్కవానిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ట్రాఫిక్ సీఐ దాశరధి నేతృత్వంలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.